క్లుప్తంగా

కరపత్రాల పంపిణీ



వనపర్తి టౌన్: విద్యా రంగ, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాడుతూ ఆగస్టు 1వ తేదీన సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభకు విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో హాజరుకావాలని రాష్ట్ర కోకన్వీనర్ అరుణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో దగాపడ్డ తెలంగాణ మార్పు కోసం మహా ఉద్యమం అనే నినాదంతో మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్, బస్సుల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ భవిత, ప్రణీత, బంగారుబాబు, హరీష్, శివ ఉన్నారు.

రూ.1.25 లక్షల చెక్కు అందజేత



వీపనగండ్ల: మండలంలోని వల్లభాపురంతండాకు చెందిన బాషానాయక్ కూతురు వాసంతి ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందింది. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.1.25లక్షల చెక్కును బాధిత కుటుంబానికి సర్పంచ్ అంజయ్యనాయక్ మంగళవారం అందజేశారు. పేదరికంలో ఉన్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందుతున్న ఆర్థిక సాయం ఎంతో వెసులుబాటు ఇస్తుందని ఆయన అన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి, వెంగళాయిపల్లి, జమ్మాపూర్, బండపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం అధికారులు సందర్శించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, వెంటిలేషన్, భవనాల పరిస్థితులను పరిశీలించి జిల్లా అధికారులకు నివేదికలు అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ శంకరయ్య, నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు సంరక్షించాలి

కొత్తకోట రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు పెద్దమందడి ఎంపీడీఓ అఫ్జల్ సూచించారు. మండలానికి 1.76లక్షల మొక్కలు నాటడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. వర్షాలు కురుస్తుండటంతో మొక్కలు నాటేందుకు ప్రతి గ్రామంలో సిద్ధం చేయాలన్నారు.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి: ఎస్ఎఫ్ఐ

కొత్తకోట రూరల్: విద్యార్థి పాముకాటుకు గురైనా.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్, సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని అమడబాకుల ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థి మహేందర్ పాము కాటుకు గురయ్యారు. సమాచారం అందించినా ప్రిన్సిపాల్ స్పందించపోవడంతో విద్యార్థి పరిస్థితి విషమంగా మారింది. దీంతో మంగళవారం ఆయన స్థానిక ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి గురుకుల పాఠశాలను సందర్శించారు. అనంతరం కిరణ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సమస్యలు చెప్పుకొనే స్వేచ్ఛ కూడా లేదని, తరగతులు ప్రారంభమై రెండునెలలు గడుస్తున్నా నేటికీ పాఠ్య, రాత పుస్తకాలు అందకపోతే చదువులు ఎలా సాగుతాయని ప్రశ్నించారు. స్కూల్, కళాశాల విద్యార్థులు 550 మంది ఉంటే సరిపడా తరగతి గదులు లేకపోవడంతో వరండాల్లోనే కూర్చుంటున్నారని, తరగతి గదిలోనే పడుకుంటున్నారని వివరించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వీపనగండ్లలోనే పాఠశాల కొనసాగేలా స్థలం చూసి అక్కడే భవన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది, జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి పాల్గొన్నారు.

విద్యారంగంపై నిర్లక్ష్యం తగదు

పెబ్బేరు: రాష్ట్రంలోని ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని యూఎస్‌పీసీ పోరాట కమిటీ నాయకులు మంగళవారం డిమాండ్ చేశారు. అనంతరం పెబ్బేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, నాయకులు భీసన్న, వినోద్‌కుమార్, విజయ్‌కుమార్, జ్ఞానలక్ష్మి, శ్రీలత, కవిత, శ్రీధర్, సుచరిత, రజని, పావని, తిరుపాజి, మహేశ్వరమ్మ ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

అమరచింత: మహిళా సంఘాల సభ్యులు పొదుపులో ముందుండి ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా కోరారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మెప్మా కోఆర్డినేటర్ యువరాజ్, బ్యాంక్ మేనేజర్‌తో కలిసి మహిళ సంఘాల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈమేరకు మెప్మా ఆర్పీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పొదుపుపై మహిళలు మెలగాలి అన్న విషయాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా రుణాలను పొందుతున్న మహిళా సంఘాల సభ్యులు ప్రతి నెల క్రమం తప్పకుండా వాయిదాలను చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా బ్యాంకు రుణాలు తీసుకొని, చెల్లించలేని మహిళలపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాయిదా చెల్లించేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ మహ్మద్‌ఖాజా

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

పొదుపు సంఘాల మహిళలకు రుణాలను ఇప్పించడం, వారి నుండి బ్యాంకుకు కిస్తుల రూపంలో చెల్లించేలా అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఆర్పీలపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. ఈమేరకు విధుల్లో బ్యాంకు రుణాల రికవరీలో నిర్లక్ష్యం వహించిన ఆర్పీకి షోకాజ్ నోటీసులు అందించారు.

చర్యలు తీసుకుంటాం

మృతి చెందిన వ్యక్తుల సమాచారం ఇవ్వకుండా వారి కుటుంబ సభ్యులు ప్రతి నెల ఆసరా పింఛన్ డబ్బులు తీసుకుంటున్నారని ఫిర్యాదులు అందుతున్నాయని, అలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. కొత్తకోటలో ఒక వ్యక్తి మృతి చెంది ఏళ్లు గడుస్తున్నా ఆవ్యక్తి పింఛన్ డబ్బులను ప్రతి నెల వాడుకున్న కుటుంబ సభ్యులకు నోటీసులు అందించామన్నారు. తీసుకున్న డబ్బులను సకాలంలో తిరిగి చెల్లించకుంటే పోలీసు కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో సైతం ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, వీటిపై తమ సిబ్బందితో వివరాలను సేకరిస్తున్నామన్నారు.

పోరాట యోధుడు నెల్సన్ మండేలా

వనపర్తి టౌన్: జాత్యాహంకార దోపిడీని ధిక్కరించి సమానత్వ హక్కుల సాధనకు జీవితం త్యాగం చేసిన పోరాట యోధుడు నెల్సన్ మండేలా అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. నెల్సన్ మండేలా జయంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. నల్ల జాతీయుల హక్కులను కాలరాసి, వారి చేత వెట్టి చాకిరీ చేయిస్తున్న వారిపై తిరుగుబాటు చేశారని గుర్తుచేశారు. మండేలా పోరాట స్ఫూర్తి ప్రపంచానికి మార్గదర్శకమని చెప్పారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, విభూది ఈశ్వర్, దేవన్న నాయుడు, బండలయ్య, కౌన్సిలర్ బాషా నాయక్, షేక్యా నాయక్, పుల్యా నాయక్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మండేలా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రమాదవశాత్తు వ్యాను దగ్ధం

మదనాపురం: మండలంలోని గోపన్‌పేట సమపంలో బుధవారం సాయంత్రం ఓమిని వ్యానులో మంటలు చెలరేగి వాహనం పూర్తి దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ మురళీ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లాకు చెందిన అమర్‌సింగ్ మూడు నెలల క్రితం భార్య పిల్లలతో వనపర్తికి వచ్చి ఔషధ మూలికలు అమ్ముకొని జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం భార్య సంగీత, తన ముగ్గురు పిల్లలను తీసుకొని ఓమిని కారులో వారి స్వగ్రామం వెళ్తుండగా.. అకస్మాత్తుగా కారులో మంటలు చెలరేగాయి. అటుగా వెళ్తున్న వాహనదారులు, ప్రయాణికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించిన ఫలితం లేకపోయింది. మంటల్లో కారు పూర్తిగా కాలిపోయింది. ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మంటల్లో కాలిపోతున్న ఓమిని వ్యాను

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారం

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో 2023 విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పూర్వపు విద్యార్థులు మంగళవారం నగదు పురస్కారంతో పాటు షీల్డ్‌లను అంజేశారు. ఇంగ్లిష్ మీడియం విద్యార్థి ధరణికి రూ.3వేలు, కార్తీక్‌కు రూ.2వేలు, సందీప్, గణేష్‌నాయుడుకు రూ.వెయ్యి, తెలుగు మీడియం విద్యార్థులు వినిల్‌కు రూ.3వేలు, రాకేష్, జయరాములు, మహేష్, రవికి రూ.వెయ్యి చొప్పున, బాలికలకు చామంతికి రూ. 3వేలు, కుసుమకు రూ. 2వేలు, రోజ, వైష్ణవికి రూ.వెయ్యి చొప్పున నగదు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్‌రావు, బాలిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సర్వసతిదేవి, పూర్వ విద్యార్థులు భాస్కర్‌రెడ్డి, బుచ్చారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు పురస్కారం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఓటమి భయంతోనే అనుచిత వ్యాఖ్యలు



అమరచింతలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కొత్తకోట చౌరస్తాలో..

కొత్తకోట: జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం కొత్తకోట చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయేజ్ మాట్లాడుతూ అధికారం ఉందని అడ్డగోలుగా మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు బుద్ధి చెప్తారన్నారు. 2004లో ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. 2024లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు 24గంటల నాణ్యమైన విద్యుత్ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మేస్త్రీ శ్రీను, కౌన్సిలర్ నాగన్నసాగర్, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గొల్లబాబు, బీచుపల్లియాదవ్, జేసీబీ రాములుసాగర్, శేఖర్‌రెడ్డి ఉన్నారు.

ఆత్మకూర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. రాహుల్‌గాంధీపై కేటీఆర్ వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్‌గౌడ్, తులసీరాజ్, రహ్మతుల్లా, గంగ, ఈర్లదిన్నె శ్రీను, షబ్బీర్, కుర్షీద్, సతీష్, మన్యం, రాములు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్, రవి ఉన్నారు.

అమరచింత: పట్టణ కేంద్రంలో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ ఆధ్వర్యంలో దహనం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, ప్రకాశం, శ్యాం, పోషిరిగారి విష్ణు, శ్రీధర్, కృష్ణానాయక్ ఉన్నారు.

మదనాపురం: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆదేశానుసారం మండల కేంద్రంలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గట్టెల నాగన్న, జగదీష్, వడ్డె కృష్ణ, శ్రీనివాసులుయాదవ్, రామకృష్ణ, మహేష్, అంజద్ అలీ, వడ్డె బాలస్వామి, శేఖర్, కోటేశ్వర్, విజయ్, మహేందర్, జయరాములు, తిర్మలాయపల్లి బాలకిష్టన్న, కొండన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని మాజీ మంత్రి, ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి అన్నారు. మండలంలోని పర్వతాపురం, మామిడిమాడ, ముందలి తండా, వెనికి తండా, సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లి, మల్కిమియాన్‌పల్లి, రోడ్డుమీదిండా, అల్లమాయపల్లి తదితర గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ అధ్యక్షతన నూతన గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన నూతనంగా ఎంపికైన కమిటీల నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడిమాడ నేరుడు చెరువును రిజర్వాయర్ పనులు ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేసి చూపుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, నాయకులు దామోదర్‌రెడ్డి, కృష్ణయ్యయాదవ్, డాక్టర్ నరేందర్‌గౌడ్, దేవిజానాయక్, క్యామ బాల్‌రాజు, అనిల్‌కుమార్, నరేందర్, బాల్‌రెడ్డి, బాల్‌రాజు యాదవ్, గోవిందు, వెంకట్రాములు, భరత్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిపై చర్యలు తీసుకోవాలి

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ఓ కాలనీలో ఒంటరిగా నివాసం ఉంటున్న తనపై ఆదివారం దాడి చేసిన కురుమన్నపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని మంగళవారం కావలి సంధ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయాన్ని అదునుగా తీసుకున్న నిందితుడు మిరాసిపల్లికి చెందిన కురుమన్న తన మెడకు టవల్ చుట్టి, బట్టలు కత్తిరించే కత్తెరతో పొడవడంతో తీవ్రంగా గాయపడ్డానని, ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. దీనిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా.. సీసీ కెమెరాల ద్వారా నిందితుడిని గుర్తించి కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. తనకు ప్రాణహాని ఉందని, పోలీసులు వేగంగా చర్యలు తీసుకొని నిందితుడిని కఠినంగా శిక్షించాలని బాధితురాలు వేడుకున్నారు.

రెండు కుటుంబాల మధ్య గొడవ: కేసు నమోదు

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని చెన్నారంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ముల మధ్య చిన్న గొడవ పెద్దది కావడంతో ఒకరిపై ఒకరు కేసులు నమోదు చేసుకున్నారు. రేవల్లి ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల మేరకు.. రేవల్లి మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన పెద్ద వెంకటయ్య, చిన్న వెంకటయ్య వరుసకు అన్నదమ్ములు. కొంతకాలంగా పొలం విషయంలో వారి మధ్య చిన్నచిన్న గొడవలు ఉన్నాయి. సోమవారం రాత్రి ఇంటి పక్కకు వచ్చారని ఒకరినొకరు తిట్టుకున్నారు. తిట్లతో ప్రారంభమైన గొడవ రాళ్లతో కొట్టుకునే వరకు వెళ్లింది. దీంతో తలలకు రక్త గాయాలయ్యాయి. ఇరు కుటుంబ సభ్యులు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోగా కేసులు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

సమష్టిగా ఎదుర్కొందాం

వనపర్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను సమష్టిగా వ్యతిరేకిద్దామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, సీఐటీయూ రాష్ట్ర నాయకులు పుట్ట ఆంజనేయులు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోష పిలుపునిచ్చారు. మంగళవారం క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో స్థానిక యాదవ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా సదస్సుకు వారు హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానం అనుసరిస్తోందని, ఈ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి ఉందన్నారు. స్వాతంత్ర పోరాటంలో పాత్ర లేని బీఆర్ఎస్, బీజేపీలు స్వాతంత్ర పోరాట ఫలాలను ప్రజలకు దక్కకుండా చేస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకముందు అదానీ సంపద రూ.56 వేల కోట్లుగా ఉండగా.. ప్రస్తుతం రూ.16 లక్షల కోట్లకు పెరగటం అభివృద్ధి ఎక్కడ జరుగుతుందనే విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తీసుకొచ్చి కార్మికుల సంక్షేమాన్ని ప్రశ్నార్థకంలో పడేశారని విమర్శించారు. ఆగస్టు 9, 10 తేదీల్లో కలెక్టర్ కార్యాలయం ఎదుట మహా పడావ్ పేరుతో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. జిల్లా సదస్సులో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్, సహాయ కార్యదర్శి రాము, ఏఐటీయూసీ నాయకులు సురేష్, సీఐటీయూ నాయకులు రాములు, నాయకులు వెంకటేష్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతాం

పాన్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేస్తూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకే బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తుందని పార్టీ నియోజకవర్గ నాయకులు అన్వేష్, రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని జమ్మాపూర్, వెంగళాయిపల్లి గ్రామాల్లో ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరిస్తూ ఎల్లేని సుధాకర్‌రావును గెలిపించాలన్నారు.



తూంకుంటలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

వీపనగండ్ల: రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని బీజేవైఎం జిల్లా నాయకుడు మహేశ్‌యాదవ్ అన్నారు. మంగళవారం తూంకుంటలో బీజేపీ నియోజకవర్గ నాయకుడు ఎల్లేని సుధాకర్‌రావు నాయకత్వంలో గడప గడపకు బీజేపీ, గుండె గుండెకు ఎల్లేని అనే కార్యక్రమం ద్వారా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

వీపనగండ్ల: ముసురు వర్షాల సమయంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రజలు జాగ్రత్త వహించాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. మంగళవారం వల్లభాపురంలో ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, ప్రజలతో కలిసి సామూహిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఆరోగ్య మహిళా కార్యక్రమాలు, మోదీ హెల్త్ కార్డులు తదితర అంశాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండడం వల్ల వారికి ప్రయోజనం కలుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య వసతుల గురించి ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రావుల రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



వల్లభాపురంలో ఆరోగ్య పరిరక్షణపై సూచనలిస్తున్న వైద్యాధికారులు

మట్టి మిద్దెలతో జాగ్రత్త

కొత్తకోట రూరల్: వాతావరణ శాఖ సూచన మేరకు మూడు రోజుల పాటు వర్షాలు ఉన్నందున మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తకోట ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి సూచించారు. పాత ఇళ్లు, గుడిసెలు, శిథిలావస్థకు చేరిన నివాసాల్లో ఎవరూ నివసిస్తున్నా వారికి ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలన్నారు. వాగు తీర గ్రామాల్లో పెద్దలు తమ పిల్లలను వాగుల్లోకి వెళ్లకుండా చూసుకోవాలని, వాగులు, వంకలు నీటి ప్రవాహాలు వచ్చే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వర్షాల దృష్ట్యా ఎలాంటి సమస్య వచ్చిన మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించాలి



వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న అధికారులు

పాన్‌గల్: విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారిలో పఠనాసక్తిని పెంపొందించాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండలంలోని వెంగళాయిపల్లి, బండపల్లి ప్రాథమిక పాఠశాలలు, జమ్మాపూర్, కేతేపల్లిలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా బోధన సాగించాలన్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించేలా హెచ్ఎంలు పర్యవేక్షించాలని ఆదేశించారు.



వనపర్తిలో..

స్టడీ మెటీరియల్స్ పంపిణీ

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్స్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ పంపిణీ చేశారు. ఎస్ఏ–బీయూ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మిరాసిపల్లి గొల్ల బుచ్చన్న, గొల్ల సాయమ్మ ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని స్టడీ మెటీరియల్స్‌ను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగితేనే జీవితంలో ఉన్నతంగా స్థిరపడతారని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ శ్రీనివాసులు, స్వప్న, రాములు యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, జానకమ్మ, అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్, గంధం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక గర్జన వాల్‌పోస్టర్లు విడుదల



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: కార్మిక సమస్యల సాధన కోసం ఆగస్టు 4వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించబోయే కార్మిక గర్జనను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదట ఐఎఫ్‌టీయూ కార్మిక గర్జన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు 2016లో ఒకే రకమైన పనికి జీతాల్లో భేదాలు లేకుండా ఎక్కువ, తక్కువ ఇవ్వడం బానిసత్వంతో సమానమని చెప్పినా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్కువ జీతాలతో కార్మికులను పనిచేయించుకోవడం దారుణమని మండిపడ్డారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ప్రసాద్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు గణేష్, సుబ్బయ్య, ఏదుట్ల కురుమయ్య, వెంకటన్న, రామ్‌చంద్రి, కరీం, పెంటన్న, రాజు, శ్రీను, చంద్రయ్య, బాలమాసి, గోవిందమ్మ, పద్మ, శాంతమ్మ, నాగమ్మ, వెంకటేష్, భాగ్యమ్మ, వెంకటమ్మ, లక్ష్మి, మానస, కురుమయ్య, రేణుక, దుర్గమ్మ, నరేష్, సురేష్ పాల్గొన్నారు.

సఫాయి కార్మికుల సమస్యలపై మంత్రి స్పందించాలి

వనపర్తి: పదమూడు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు మంత్రి నిరంజన్‌రెడ్డి చొరవ చూపించాలని మంగళవారం కమ్యూనిస్టు, ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రి ఓఎస్‌డీ పూర్ణచంద్రారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. స్వచ్ఛ తెలంగాణలో క్రియాశీల పాత్ర పోషిస్తు, ప్రజారోగ్యం కోసం తమ ఆరోగ్యాన్ని లెక్కచేకుండా పని చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు 11వ పీఆర్సీ జీఓ నెంబర్ 60 ప్రకారం సఫాయి కార్మికులకు రూ.15,600, కారోబార్, బిల్ కలెక్టర్, ట్రాక్టర్ డ్రైవర్లకు రూ.19,500 వేతనం ఇవ్వాలని కోరారు. ప్రమాద బీమా రూ. పది లక్షలు, సాధారణ మరణానికి రూ.ఐదు లక్షలు బీమా కల్పించాలన్నారు.

ఏళ్లుగా పనిచేస్తున్నా..

కనీస వేతనాల చట్టం అమలు చేయకుండా సెల్యూట్ సన్మానాలతో సరిపెడుతున్నారని, ఉద్యమ సమయంలో సీఎం కేసీఆర్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి అందరికీ రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తింపునిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 2016 అక్టోబర్ 26న సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా.. రాష్ట్రంలో నేటికీ అమలుకు నోచుకోవటం లేదని గుర్తుచేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు గణేష్, కురుమయ్య, నిక్సన్, రాము, వెంకటేష్, సుబ్బయ్య, మద్దిలేటి, రాములు, లక్ష్మీనారాయణ, చంద్రయ్య, శ్రీను, రామ్ చంద్రయ్య, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సఫాయి కార్మికులు